క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

అమరచింత: పురపాలిక అనుమతి లేకుండా పట్టణంలో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా హెచ్చరించారు. పట్టణంలోని తొమ్మిదో వార్డులో జన్నుపాండు తన ఇంటి ముందున్న రహదారిని అనుసరించి మరుగుదొడ్డి నిర్మిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం సిబ్బందితో కలిసి వెళ్లి కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని.. అధికారుల అనుమతితో పనులు ప్రారంభించాలని సూచించారు.

బాధితుల ఆందోళన..

మరుగుదొడ్డి నిర్మాణాన్ని కూల్చివేయడం ఎంతవరకు సమంజసమని బాధిత కుటుంబ సభ్యులు పుర కమిషనర్‌తో వాదనకు దిగారు. ఇంటి ఆవరణలో కచ్చితంగా వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నా.. ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పలు వార్డుల్లో డ్రెయినేజీలను కబ్జాచేసి నిర్మాణాలు చేపట్టారని.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక అధికారులు నిర్మాణానికి సహకరించకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

మహబూబ్‌నగర్ రూరల్: నియోజకవర్గ అభివృద్ధి బీఆర్‌ఎస్ హయాంలోనే సాధ్యమైందని ఎంపీపీ సుధాశ్రీ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగునీరు, అర్హులందరికీ పెన్షన్లు, దళితబంధు ద్వారా ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. 32 డబుల్ బెడ్రూం ఇళ్లు, రూ.85లక్షలతో సీసీరోడ్లు, రైతువేదిక వంటిని నిర్మించామని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని, మన్యంకొండలో రోప్‌వే ఏర్పాటు కాబోతుందని, అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ నాయకులు తమ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని, మంత్రిని కించపరిచేలా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ చంద్రకళ, నాయకులు రాఘవేందర్‌గౌడ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్షంగా కమిటీ ఎన్నిక చెల్లదు

మహబూబ్‌నగర్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మాలల స్ఫూర్తి భవన నిర్మాణ కమిటీని ఏకపక్షంగా ఎన్నుకున్నారని, అన్ని మాల సంఘాల అభిప్రాయాలతో నూతన కమిటీని ఎన్నుకోవాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి అన్నారు. శనివారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు జి.చిన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ మాలల స్ఫూర్తి భవన నిర్మాణం కోసం క్రిష్టియన్‌పల్లి శివారులోని 523 సర్వేనంబర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించి అన్ని సంఘాలతో కలిసి ఒక కమిటీ వేసుకొని భవన నిర్మాణం చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఒకటి, రెండు సంఘాల నాయకులు మాత్రమే అన్ని సంఘాలను కలుపుపోకుండా నియంతృత్వ పోకడలతో కమిటీని ఎన్నుకున్నారని అన్నారు. అంతేకాకుండా కమిటీ చైర్మన్ నేనే అంటూ తనకు తానే ప్రకటించుకున్న మంత్రి నర్సింహయ్య నిర్ణయం సరైంది కాదన్నారు. అన్ని మాల సంఘాల నాయకులతో కలిసి అందరి సమక్షంలో కమిటీని ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో ఇట్టి విషయాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దృష్టికి తీసుకపోతామని అన్నారు. సమావేశంలో మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి అరేందర్, నాయకులు శ్రీనివాసులు, ఆంజనేయులు, రవికుమార్, వెంకటేష్, ఆనంద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం



నవాబుపేట: మండలంలోని భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, సర్పంచ్ గోపాల్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు మండల కేంద్రంలో కార్యాలయం నిర్మించుకునేందుకు సహకరిస్తామని తెలిపారు. ఇళ్లు లేని కార్మికులు ఉంటే వారికి ప్రభుత్వపరంగా చేయూతనిస్తామని అన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడిగా రంగయ్య, ప్రధాన కార్యదర్శిగా గోవింద్‌నాయక్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో శ్రీనివాస్, వెంకటేష్, రాములు, జంగయ్య పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా పార్కింగ్



జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిలిపిన వాహనాలు



పాతబస్టాండ్ రోడ్డులో..

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడబడితే అక్కడ రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారి వెంట సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. తోపుడు బండ్లు, కూరగాయలు అమ్మేవారు తదితర చిరువ్యాపారులు రోడ్లపైనే అమ్మకాలు చేస్తుండడంతో వారి దగ్గర కొనుగోలు చేయడానికి వచ్చే వారు తమ వాహనాలను రోడ్ల వెంటనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ఇబ్బందులు తలెత్తున్నాయి. పాదాచారులు నడవడానికి కూడా సమస్యగా మారుతోంది. ముఖ్యంగా చిన్న పిల్లల ప్రభుత్వ ఆస్పత్రి, పాతబస్టాండ్, మెయిన్ బజార్, సివిల్‌లైన్ రోడ్, సత్యనారాయణ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాల్లో పరిస్థితి దారుణంగా ఉందని పలువురు అంటున్నారు. రోడ్ల వెంబడే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని అంటున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇష్టానుసారం పార్కింగ్ చేసేవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా అవసరమైన చోట నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయాలని అంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

మరికల్: ముందుగా వేసిన వరి పంటలు ప్రస్తుతం కోతదశకు వచ్చాయని వెంటనే ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న, కృష్ణయ్య అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రస్తుతం అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో తక్షణమే ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటే రైతులు నష్ట పోకుండా ఉంటారన్నారు. సమావేశంలో హరీష్, రామకృష్ణ, మొగులప్ప, చెన్నరెడ్డి, ఆంజనేయులు, రఘు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంబలి వితరణ



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు వేసవి దృష్ట్యా రాగి అంబలి వితరణ చేశారు. ప్రధానాచార్యులు దత్తు చౌద్రి, పాఠశాల కార్యదర్శి పటేల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతివనాన్ని సందర్శించిన విద్యార్థులు



పల్లెపకృతి వనంలో విద్యార్థులు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం గ్రామశివారులోని పల్లెప్రకృతి వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వనంలో ఉన్న వివిధ రకాల మొక్కల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ రవీందర్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొని మాట్లడారు. విద్యార్థులు వనాన్ని సందర్శించడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రులకు సమయం దొరికినప్పుడు పిల్లలతోపాటు ఇక్కడికి వచ్చి వనభోజనాలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులు ఆనంద్, గీత, సంజప్ప, హన్మంతు, అంజి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'



ధన్వాడ నుంచి సభకు వెళ్తున్న నాయకులు



ఉట్కుల్‌గిద్దలో..

దామరగిద్ద: మండలంలోని ఉట్కుల్‌గిద్ద బీజేపీ నాయకులు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభకు తరలివెళ్లారు. వారిలో అనంత్‌రెడ్డి, సాయిలు, వెంకటప్ప, మధు, తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు.

ధన్వాడ: హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభకు శనివారం ధన్వాడ, గున్ముక్ల, మంత్రోనిపల్లి నుంచి అభిమానులు, నాయకులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు మాకంసురేందర్, కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, రాంచంద్రయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మరమ్మతు చేయరా?



హాజీఖాన్‌పేటలో ధ్వంసం చేసిన సీసీ రోడ్డు

- మిషన్ భగీరథ కోసం రోడ్డు ధ్వంసం
- ఆరు నెలలుగా పూర్తి చేయని వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని హాజీఖాన్‌పేటలో మిషన్ భగీరథ పనుల నిమిత్తం రోడ్డు మధ్యలో డ్రెయినేజీలు, సీసీలను ధ్వంసం చేశారు. దాదాపు ఆరు నెలల క్రితం పైపు లైన్ పనులు చేయగా, ధ్వంసం చేసిన డ్రెయినేజీలకు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు చేయలేదు. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రోడ్డు దాటలేక రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. భగీరథ పనులు చేసే క్రమంలో అధికారుల సమన్వయం లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. మున్సిపాలిటీకి అత్యంత సమీపంలో ఉన్న హాజీఖాన్ పేట సమస్యను అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో శనివారం ఉదయం నిర్వహించిన రన్‌ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. స్థానిక కల్వరి ఎంబీ చర్చి మైదానంలో ప్రారంభమైన ఈ రన్ పాతబస్టాండ్, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్, ఆర్టీసీ బస్టాండ్, న్యూటౌన్, రైల్వే స్టేషన్ చౌరస్తా, ఎర్రసత్యం, తెలంగాణ చౌరస్తాల మీదుగా తిరిగి ఎంబీ చర్చి వరకు చేపట్టారు. ఎంబీసీ చైర్మన్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శాంతిదూతయని, ప్రేమను పంచడమే ఆయన సందేశమని అన్నారు. కీస్తు బోధనలు మానవాళికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో పాస్టర్ బీఎస్ పరంజ్యోతి, నందకిరణ్, సంఘ కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడిగా కేశవ్

నర్వ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడిగా కేశవ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు రెగ్యులర్ వైద్యురాలు డా. ఫాతిమా బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో పల్లె దవాఖాన వైద్యురాలు డా. కృష్ణప్రియ తాత్కాలికంగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ వైద్యులు డా. కేశవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.

కూరగాయల సాగుపై అవగాహన కల్పించండి

మరికల్: తక్కువ నీటి వనరులతో పండే కూరగాయల తోటల సాగు పై రైతులకు ఉద్యానవనశాఖ అధికారులు అవగాహన కల్పించాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు దామోందర్‌రెడ్డి, దండుశ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల పర్యవేక్షణ లేక కూరగాయల సాగు తగ్గుతోందన్నారు. కూరగాయలకు సోకే తెగుళ్ల, వాటి నివారణ అంశాలపై అవగాహన కల్పిస్తే రైతులు తోటలను సాగు చేసుకునేందుకు ముందుకు వస్తారన్నారు.

11న ఊరడమ్మ జాతర

దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్‌లో వెలసిన ఊరడమ్మ జాతర మంగళవారం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు తెలిపారు. ఉదయం పల్లకీసేవా, జెల్దిబిందె ఉత్సవం, సాయంత్రం బోనాల ఉత్సవాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థినికి పోలీసుల సహకారం

మక్తల్: ఓ విద్యార్థినిని సకాలంలో పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు పోలీసులు సహకరించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే భవానీ అనే విద్యార్థిని పదో తరగతి మ్యాథ్స్ సప్లీమెంటరీ పరీక్ష రాసేందుకు నారాయణ పేటలోని ఓ సెంటర్ వెళ్లాల్సి ఉండగా పొరపాటున మక్తల్‌లోని పరీక్ష కేంద్రానికి వెళ్లింది. సెంటర్ నారాయణ పేట అని ఆమెకు అర్థమయ్యే సరికే ఉదయం 8.45 గంటలు అయ్యింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమెకు పోలీసులు సహకరించారు. సీఐ సీతయ్య ఆదేశాల మేరకు కానిస్టేబుల్ అశోక్ ఆమెను ద్విచక్రవాహనంపై సకాలంలో పరీక్ష కేంద్రానికి చేర్చారు. దీంతో అశోక్‌ను అందరూ అభినందించారు. సీఐ ఆయనకు నగదు ప్రోత్సాహకం అందించారు.

తొలగింపు ఉత్తర్వులు నిలిపివేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కమలాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి హిందీ పరీక్ష పేపర్ బయటకు వచ్చిన సంఘటనలో స్కూల్ అసిస్టెంట్ సబియా మదాహత్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఉత్తర్వులు నిలిపి వేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్పీసీ) జిల్లా నాయకులు జి.ఆదిత్య, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, కె.రవికుమార్, మహమూద్, నవీన్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు.

పంటలకు అడవి పందుల బెడద



వరిపంట చుట్టూ చీరలు కట్టిన రైతులు

మరికల్: మండలంలోని ఆయా గ్రామాల్లో అడవి పందులు కోతకు వచ్చిన వరి పంటలను దెబ్బతీస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొందరు రైతులు రాత్రింబవళ్లు తేడా లేకుండా కంటికి రెప్పగా పంటలకు రక్షణగా ఉంటున్నారు. అయినప్పటికీ నిత్యం ఏదో ఒకచోట పంటలను ధ్వంసం చేస్తునే ఉన్నాయని వాపోతున్నారు. ఇదిలా ఉంటే మరికొందరు పంటల రక్షణ కోసం చుట్టూ చీరలు కడుతున్నారు. రక్షణ ఏర్పాటు చేసుకోకపోతే పంటమొత్తం పాడయ్యే అవకాశం ఉందని ఆవేదన చెందుతున్నారు. అలా మండలంలోని ఓ గ్రామంలో పంట రక్షణ కోసం రైతు చీరలు కట్టిన ఫొటో సాక్షి కెమెరాకు చిక్కింది.

ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్

మరికల్: వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం నాయకులు శనివారం డిమాండ్ చేశారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల నుంచి అనేక ఉద్యమాలు చేసినా ఎవరూ తమగోడును పట్టించుకోవడం లేదని వాపోయారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత కూడా తమ బతుకులు మారడం లేదన్నారు. రాబోయే రోజుల్లో హక్కుల సాధన ధ్యేయంగా చేసే పోరాటాల కోసం యువత ఏకం కావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా నాయకులు నర్సిములు, చంద్రప్ప, రాములు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి

కృష్ణా: మండల కేంద్రానికి చెందిన శేషగిరి భార్య వీణ (టీచర్) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని శనివారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. ఆమె అవయవాలను దానం చేయడం గొప్పవిషయమని అన్నారు. శేషగిరి కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, నర్సింహాగౌడ్, కృష్ణా మాజీ సర్పంచ్ మహాదేవ్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

మాగనూర్: ప్రభుత్వం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు శనివారం తెల్లవారుజామున పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మాగనూర్ మండలంలోని గజ్జరందొడ్డికి చెందిన వెంకట్‌రెడ్డి రాత్రి సమయంలో పెద్దవాగు నుంచి అక్రమంగా చిట్యాలకు ఇసుక తరలింపు చేపట్టాడు. ఈ క్రమంలో డయల్-100 సిబ్బంది మహేష్, రమేష్‌రావులు రాత్రి గస్తీ నిర్వహించి ట్రాక్టర్‌ను పట్టుకుని ఎలాంటి పత్రాలు లేవని గుర్తించారు. దీంతో సదరు ట్రాక్టర్‌ను మాగనూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించి యాజమానిపై కేసు నమోదు చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

టీ సేవ ఫోరం ఆధ్వర్యంలో రిలేదీక్షలు



మాట్లాడుతున్న కర్ని గంగాధర్

నర్వ: వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు టీసేవ ఫోరం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రిలేదీక్షలు చేపట్టినట్లు మక్తల్ కోఆర్డినేటర్ కర్ని గంగాధర్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టిన సందర్భంగా మాట్లాడారు. వెంటనే 1.91 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ రిలీజ్ చేయాలన్నారు. టీఎస్‌పీఎస్సీలో ప్రక్షాళన చేపట్టాలన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలన్నారు. నిరుద్యోగులకు భృతి చెల్లించాలన్నారు. దీక్షలో మక్తల్, నర్వ మండలాల అధ్యక్షులు నరేందర్, మైబు, నాయకులు నాగరాజ్‌రెడ్డి, మారుతి, రవి, ఖాజా, మనోహర్, సురేష్‌గౌడ్, కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

'హామీలు మరిచిన కేంద్రప్రభుత్వం'



మాట్లాడుతున్న కొండన్న

మరికల్: కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కొండన్న అన్నారు. మరికల్‌లో శనివారం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో వచ్చిన తర్వాత నియంతల పరిపాలన సాగిస్తోందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలు మరిచిందన్నారు. ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ప్రజలను మోసం చేశారని విమర్శించారు. నాయకులు రాములు, మోహన్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.

పులిమామిడిలో బలగం సినిమా ప్రదర్శన



సామూహికంగా సినిమా చూస్తున్న గ్రామస్తులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో శుక్రవారం బలగం సినిమాను ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూరయ్య గౌడ్ మాట్లాడారు. తెలంగాణ సామాజిక నేపథ్యం ఆధారంగా నిర్మితమైన బలగం సినిమా అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందిందన్నారు. తెలంగాణ భాష, యాసలతో సినిమా తీశారన్నారు. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం వల్ల కుటుంబ వ్యవస్థలు చిన్నాభిన్నం అవుతున్నాయని, వాటి విలువను చెప్పే విధంగా సినిమా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు రత్నయ్య, శ్రీనివాస్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్ విడుదల



వాల్ పోస్టర్లతో నాయకులు

కృష్ణా: రాయికోడ్‌లో ఈ నెల 11న సావిత్రిబాయ్, జ్యోతిరావ్ పూలేల విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు ఆంజనేయులు, నాగేష్, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: రాయికోడ్‌లో 11న చేపట్టనున్న విగ్రహాల ఆవిష్కరణకు సంబంధించిన వాల్ పోస్టర్లను అంబేడ్కర్ సంఘం నాయకులు శనివారం విడుదల చేశారు. మండల అధ్యక్షుడు సగరం రమేష్, నాయకులు నాగేష్, శంకర్, రవికుమార్ అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: రాయికోడ్‌లో 11న నిర్వహించే విగ్రహాల ఆవిష్కరణ పోస్టర్‌లను నర్వలో శనివారం విడుదల చేశారు. నిర్వాహకులు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గుడిసె వెంకటయ్య, అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు దండు అయ్యప్ప, డా.శంకర్, మీసేవా శంకర్, గడ్డం నర్సిములు, మారెప్ప, అంజి, రవి, రమేష్, ఆటో అయ్యన్న, బొజ్జన్న, పాండు తదితరులున్నారు.